సాక్షి జగిత్యాల

శుక్రవారం, 21, ఏప్రిల్, 2023



గొర్రెల పంపిణీకి సన్నాహాలు

పెగడపల్లి : జిల్లాలో రెండోవిడత గొర్రెల పంపిణీకి పశుసంవర్ధక శాఖ అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. - 8లో




ముస్లింలకు ఇఫ్తార్

జగిత్యాల : దేవిశ్రీ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
39.0/23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.



న్యూస్‌రీల్

పురాతన కోనేరు పరిశీలన



కోనేరు పరిశీలిస్తున్న మకరంద్

కోరుట్లటౌన్: పట్టణంలోని పురాతన కోనేరును అదనపు కలెక్టర్ మకరంద్ ఆర్డీవో వినోద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ ఆయాజ్‌తో కలిసి గురువారం సందర్శించారు. కోనేరు నిర్మాణం పరిశీలించి, స్థల చరిత్ర గురించి అర్చకులను అడిగి తెలుసుకున్నారు. పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.సాగర్, తహసీల్దార్ రాజేశ్, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని రేడియాలజీ హబ్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన రేడియాలజీ ఒకటి, రేడియోగ్రాఫర్ 11 పోస్టుల భర్తీ కోసం అర్హులైన వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. దరఖాస్తు ఫారం, నోటిఫికేషన్ వివరాలు జగిత్యాల జిల్లా అధికారిక వెబ్‌సైట్ jagtial.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులకు అవసరైన ధ్రువీకరణపత్రాలు జతచేసి ఈనెల 21 నుంచి 28వ తేదీలోగా స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అందజేయాలని కలెక్టర్ సూచించారు.

స్థల పరిశీలన

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలో రూ.2కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే మోడ్రన్ దోభీఘాట్ నిర్మాణానికి స్థానిక ఎస్సారెస్పీ కాలువ సమీపంలో ఎంపిక చేసిన స్థలాన్ని అడిషనల్ కలెక్టర్ మకరంద్ గురువారం పరిశీలించారు. ఎస్సారెస్పీ స్థలాన్ని గుర్తించి ఇటీవల స్థానిక అధికారులు కలెక్టర్‌కు నివేదిక అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అడిషనల్ కలెక్టర్ సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆటాపాటలతో ఎదుగుదల



చిన్నారులతో టీచర్లు, అధికారులు

మల్యాల(చొప్పదండి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటాపాటలతో అందించే ప్రీస్కూల్ విద్యావిధానంతో చిన్నారులు శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఎదుగుతారని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం సీడీపీవో నర్సింగరాణి ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి, గొల్లపల్లి మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారుల వార్షికోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రాడ్యుయేషన్ డే జరిపారు. ఈ ఏడాది ప్రీస్కూల్ ముగించుకున్నవారికి పట్టాలు అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నరేశ్ మాట్లాడుతూ ప్రీ స్కూల్ విద్యతో భాషాభివృద్ధి సాధ్యమన్నారు. ఎంపీపీ మిట్టపల్లి విమల, సీడీపీవో నర్సింగరాణి, సూపర్‌వైజర్లు రాజశ్రీ, పవిత్ర, మమత, ఉమ, జ్యోతి, మహేశ్వరి, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

పనులకు వచ్చేలా కూలీలను ప్రోత్సహించాలి

కథలాపూర్(వేములవాడ): ఉపాధిహామీ పనులకు కూలీలు వచ్చేలా ప్రోత్సహించాలని అడిషనల్ డీఆర్డీవో బాలె శివాజీ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతోపాటు ఉపాధిహామీ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలో కనీసం వందమంది కూలీలు పనులకు వచ్చేలా చూడాలని ఆయన అన్నారు. ఈ వేసవిలో కూలీలు పనులకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. అవసరమైతే గ్రామాల్లో కూలీలకు ఉపాధిహామీ పనులపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

➜ కోరుట్లలో ఈనెల 7న ఓ యువకుడు నలుగురిని వెంటేసుకుని పర్మిట్ రూంకు వెళ్లి మద్యం తాగాడు. ఫోన్‌చేసి మరికొందరిని పిలిపించి వారిపైనే దాడి చేశాడు. పర్మిట్ రూం నిర్వాహకులు ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

➜ పదిహేను రోజుల క్రితం కోరుట్ల అల్లమయ్య గుట్ట ప్రాంతంలో యువకులు మద్యం తాగి ఆ మత్తులో పరస్పరం దాడికి తెగబడ్డారు. ఈ గొడవ పోలీస్‌స్టేషన్‌కు చేరలేదు.

➜ నెలక్రితం కోరుట్ల అయిలాపూర్ రోడ్డులో కొందరు స్నేహితులు కలిసి రాత్రిపూట మద్యం తాగారు. ఆ మత్తులో మాటామాట పెరిగి కొట్లాడుకున్నారు. వారి దాడులతో సమీపంలోని ప్రజలు భయకంపితులయ్యారు.

వీధికో అడ్డా.. వారానికో గొడవ!

విచ్చలవిడిగా జులాయిల ఆగడాలు

- మద్యం తాగడం, గంజాయి పీల్చడం నిత్యకృత్యం
- మత్తులో ఏం చేస్తున్నారో వారికే అర్థంకాని వైనం
- జంకుతున్న జిల్లావాసులు



ఠాకూర్ ప్రవీణ్‌సింగ్ హత్యకేసులో నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

కోరుట్ల: జిల్లాలోని పలు పట్టణాల్లో కొందరు యువకులు వీధుల్లో అడ్డాలు వేస్తున్నారు. చిత్తుగా మద్యం తాగుతున్నారు. జోరుగా గంజాయి పీల్చుతున్నారు. ఆ మత్తులో అనేక ఆగడాలకు తెగబడుతున్నారు. ఐదు రోజుల క్రితం బీజేవైఎం పట్టణ మాజీ అధ్యక్షుడు ఠాకూర్ ప్రవీణ్‌సింగ్ హత్య ఈ కోవలోనే చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది.

వీధికో అడ్డా..

కోరుట్లనేకాదు.. జిల్లాలోని ప్రధాన పట్టణాల్లోని ప్రధాన వీధుల్లో కొందరు యువకులు రాత్రివేళ అడ్డాలు వేస్తున్నారు. రాత్రి 9 గంటలు దాటిందంటే చాలు.. ఆ కాలనీల్లోని కొందరు యువకులు ఒకచోటుకి చేరి బహిరంగంగా మద్యం తాగుతున్నారు. అందులో కొందరు గంజాయి పీల్చుతున్నట్లు సమాచారం. అర్ధరాత్రి దాటినా యువకులు అడ్డాలు వదలకుండా.. వారి ఇళ్లకు వెళ్లకుండా ఫోన్లలో గంటల కొద్దీ మాట్లాడటం.. కలిసి తాగిన వారితోనే మత్తులో గొడవలకు దిగుతున్నారు. ఇదేమిటని స్థానికులు ప్రశ్నిస్తే.. మత్తులో ఉన్న యువకులు వారితో గొడవకు దిగుతున్నారు.

జులాయి యువకులే..

➜ జులాయి యువకులు ఏదిచేసినా వారిపై ఫిర్యాదు చేస్తే ఎంతకైనా తెగబడతారన్న భయంతో చాలామంది ప్రజలు వెనకాడుతున్నారు.

➜ ఆయా వీధుల్లో రాత్రివేళ మహిళలు బయటకు రావడానికి జంకుతున్నారు.

➜ సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకూ చాటుగా గంజాయి పీల్చుతూ కొందరు యువకులు ఆ మత్తులో ఏం చేస్తున్నామనే స్పృహ లేకుండా తోటివారితోనే కొట్లాటలకు దిగుతున్నారు.

➜ ఠాకూర్ ప్రవీణ్‌సింగ్ హత్యలో పాల్గొన్న వారిలో కొందరు ఆయనతో రోజూ తిరిగేవారే ఉన్నారని, వారంతా స్నేహితులేనని పోలీసులు చెప్పడం ఈ పరిస్థితికి అద్దం పడుతోంది.

రాత్రి గొడవ.. తెల్లవారి రాజీ..

రాత్రివేళ మద్యం మత్తులో గొడవలకు దిగుతున్న ఆకతాయిల తీరు పోలీస్‌స్టేషన్ దాకా వెళ్లడం లేదు. చాలామంది వారిలోవారు తెల్లవారి రాజీ కుదుర్చుకుంటున్నారు. రాజీ పడిన సందర్భాల్లో మనసులో ఉన్న పాత కక్షలు.. మళ్లీ మద్యం తాగిన సందర్భాల్లో బయటపడి తీవ్రమైన నేరాలకు దారితీస్తున్నాయి. ఇలాంటి గొడవలు జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో వారానికోసారి జరగడం గమనార్హం. రాత్రివేళ వీధుల్లో అడ్డాలు వేస్తున్న యువకుల తీరులో జనం బెదిరిపోతున్నారు. రాత్రివేళ పోలీసుల పెట్రోలింగ్ నామమాత్రంగా జరగడంతో యువకుల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. ఒక్కోసారి కొన్నిచోట్ల యువకులు అర్ధరాత్రి నుంచి తెల్లవారే వరకూ అడ్డాలు వేసి మద్యం తాగడం సమస్యాత్మకంగా మారింది.

ఆగడాలు నియంత్రిస్తాం

కోరుట్ల పట్టణంలో యువకుల ఆగడాల విషయంలో మాకు సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. ప్రతీఏరియాలో రాత్రిపూట పోలీస్ సిబ్బందితో పెట్రోలింగ్ చేయిస్తున్నాం. యువకులు అడ్డాలు వేసే ఏరియాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో పెట్రోలింగ్ మరింత పెంచుతాం. – ప్రవీణ్‌కుమార్, సీఐ, కోరుట్ల

కోరుట్లలో యువకులు అడ్డాలు వేసే ఏరియాలు

➜ ప్రకాశం రోడ్డు, ఝూన్సీరోడ్డు
➜ సంజీవయ్యనగర్, అంబేడ్కర్‌నగర్ వాగు
➜ కల్లూర్‌రోడ్డు, రైల్వే ట్రాక్ ఏరియా
➜ భీమునిదుబ్బ, భాగ్యనగర్, కల్లూర్‌రోడ్డు ఏరియాలు
➜ అయిలాపూర్‌రోడ్డు– కేరళ గ్రౌండ్ ప్రాంతం
➜ అల్లమయ్యగుట్ట, మాదాపూర్ కాలనీలు
➜ అయిలాపూర్ దర్వాజా, కాల్వగడ్డ బురుజు ఏరియా

వివాహితను వేధించినందుకే హత్య

వివాహితను వేధించినందుకే బీజేవైఎం మాజీ అధ్యక్షుడు ఠాకూర్ ప్రవీణ్‌సింగ్ హత్య జరిగినట్లు డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. కోరుట్ల సర్కిల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో హత్య వివరాలు వెల్లడించారు. కోరుట్ల కటికె వాడలో నివాసముండే జగదీశ్వర్ భార్యను ఠాకూర్ ప్రవీణ్‌సింగ్ తరచూ ఫోన్ ద్వారా లైంగికంగా వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని జగదీశ్వర్ తన సన్నిహితులు పోతువంచ రాహుల్‌రాజ్(20), పోగుల రాజేశ్(23), ఓరుగంటి వెంకటేశ్(24), బోయిని కల్యాణ్ ఉరఫ్ సాగర్(26), గుమ్మడి శశికుమార్ (29)కు చెప్పి ఆవేదన చెందాడు. దీంతో ఠాకూర్ ప్రవీణ్‌సింగ్‌ను ఎలాగైనా అంతమొందించాలని రాహుల్‌రాజ్, రాజేశ్, వెంకటేశ్, సాగర్, శశికుమార్ నిర్ణయించారు. పక్కా ప్లాన్‌లో భాగంగా ఈనెల 16న రాత్రి 11.30 గంటల సమయంలో అయిలాపూర్ దర్వాజా సమీపంలోకి చేరారు. ఠాకూ ర్ ప్రవీణ్‌సింగ్‌తో కలిసి రాహుల్‌రాజ్, రాజేశ్, వెంకటేస్ మద్యం తాగారు. ఆ తర్వాత బీరు సీసాలు, షాబాద్ రాళ్లతో ప్రవీణ్‌సింగ్‌పై దాడి చేశారు. కాసేపటికి సంఘటనా స్థలానికి వచ్చిన బోయిని కల్యాణ్, శశికుమార్ మరోసారి ఠాకూర్ ప్రవీణ్‌సింగ్‌పై దాడి చేశారు. స్పృహ తప్పిపడిపోయిన ఠాకూర్ ప్రవీణ్‌సింగ్ చనిపోయాడని భావించిన నిందితులు పరారయ్యారు. ఠకూర్ ప్రవీణసింగ్‌ను అతడి తల్లి అనిత.. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 17న మృతి చెందాడు. మృతుడి తల్లి అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు 9 మందిపై కేసు నమోదు చేశారు. హత్యలో నేరుగా పాల్గొన్న ఐదుగురు యువకులను గురువారం ఎఖీన్‌పూర్ శివారులో అరెస్టు చేశారు. నిందితుల నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రెండుమోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నిందితులు పరారీలో ఉన్నారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, కోరుట్ల, మేడిపల్లి ఎస్సైలు సతీశ్, సుధీర్‌రావును డీఎస్పీ రవీందర్‌రెడ్డి అభినందించారు.

లీకేజీలు, స్కాంలు దేశ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు

- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాలకు ఉజ్వల భవిష్యత్తు
- పీపుల్స్ మార్చ్‌లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



చేపల బుట్టతో భట్టి విక్రమార్క, నాయకులు

కాల్వశ్రీరాంపూర్: లీకేజీలు, స్కాంలు దేశ భవిష్యత్‌కు గొడ్డలి పెట్టు అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో విద్యార్థులు, ప్రజలు నిరాశకు లోనై అసహనం వ్యక్తం చేస్తున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్‌మార్చ్ గురువారం గంగారంలో ప్రారంభమై.. కాల్వశ్రీరాంపూర్, ఇప్పలపల్లి, మల్యాలకు చేరుకుంది. కాల్వశ్రీరాంపూర్ బహిరంగసభలో భట్టి మాట్లాడుతూ.. ప్రాజెక్టులు నిర్మించి సాగునీరు రైతుకు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. పలువురు విద్యార్థులు భట్టిని కలిసి తమ సమస్యలు వివరించారు. ఫీజురీయంబర్స్‌మెంట్ విడుదల చేయలేదని, స్కాలర్‌షిప్‌లు అందక విద్యాభ్యాసం చేయలేకపోతున్నామని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ వచ్చాక అన్నివర్గాలకు మేలు చేస్తామని భట్టి హామీ ఇచ్చారు. కూలీబంధు తెచ్చి వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేలు అందిస్తామన్నారు. అభయహస్తం, స్వశక్తి మహిళలకు పావలావడ్డీతో రుణాలిప్పిస్తామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు దందాలు, లిక్కర్ స్కాంలతో ప్రజాధనాన్ని గుల్ల చేస్తున్నారని విమర్శించారు. ఇప్పలపల్లిలో క్రీడాప్రాంగణం, శ్మశాన వాటికను ఒకేచోట నిర్మించడంపై విస్మయం వ్యక్తం చేశారు. శ్మశానవాటికలో ఆడుకునేందుకు ఎవరైనా వస్తారా? ఇదేనా బంగారు తెలంగాణ అన్నారు.

పలకరిస్తూ.. ముందుకుసాగుతూ..

భట్టి విక్రమార్క తన పాదయాత్రలో ప్రజలతో మమేకమయ్యారు. వారి ఇబ్బందులు తెలుసుకుంటూ భరోసా ఇస్తూ.. ముందుకుసాగారు. మండలకేంద్రంలోని ఓ హోటల్ వద్ద ఆగి బజ్జీలు, పునుగులు వేశారు. రోజు కష్టపడితే ఎంత వస్తోందని, కుటుంబపోషణకు సరిపోతున్నాయా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం వస్తే గ్యాస్ ధర తగ్గిస్తామన్నారు. మత్స్యకార్మికులు చేపలవల, బుట్ట బహూకరించారు. గొర్రెలకాపరులతో మాట్లాడుతూ.. సబ్సిడీపై గొర్రెలు ఇవ్వడంతోపాటు అనుబంధ పరిశ్రమలు, మటన్ మార్కెట్లు ఏర్పాటు చేస్తామన్నారు.

నక్సలైట్లకు భూములిచ్చి లాక్కున్నారు

అభివృద్ధి అంటే పేదలకిచ్చిన అసైన్డ్ భూములు, లొంగిపోయిన నక్సల్స్ పునరావాసానికి ఇచ్చిన భూములు లాక్కోవడమేనా? ఇదేనా బంగారు తెలంగాణ? అని భట్టి ప్రశ్నించారు. మల్యాలలో మాట్లాడుతూ అంతర్గాంలో అసైన్డ్‌భూములు లాక్కొని ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఇసుక, మట్టిమాఫియా రాజ్యమేలుతోందన్నారు. బినామీలతో జిల్లాలో 21 ఇసుకరీచ్‌లు నడుపుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్ సింగ్, నాయకులు ఈర్ల కొమురయ్య, సారయ్య గౌడ్, లంక సదయ్య, అన్వేష్‌రెడ్డి, గంట రాములు, కొమురయ్యగౌడ్ ఉన్నారు.

వృద్ధులను పోషించకుంటే చర్యలు



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ వినీల్‌కుమార్

మెట్‌పల్లి(కోరుట్ల): తమ పిల్లలు ఆదరించకుంటే వృద్ధులు కోర్టును ఆశ్రయించవచ్చని మెజిస్ట్రేట్ వినీల్‌కుమార్ సూచించారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. మెజిస్ట్రేట్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పోషించే బాధ్యత పిల్లలపై ఉంటుందన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని, ఒకవేళవారు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులైతే బాధ్యులైన పిల్లలతోపాటు తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ప్రధాన కార్యదర్శి తెడ్డు ఆనంద్‌తోపాటు ఒజ్జెల శ్రీనివాస్, మగ్గిడి వెంకటనర్సయ్య, జిల్లా వెంకటేశ్వర్లు, రాజ్‌మహమ్మద్ పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తేవాలి



కొనుగోలు కేంద్రంలో విద్యాసాగర్‌రావు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తేవాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కోరారు. గురువారం యామపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఫకీర్‌కొండాపూర్, యామపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తాలు, తప్ప లేకుండా తేమశాతం తక్కువగా ఉన్న ధాన్యాన్ని తీసుకొచ్చి సహకరించాలన్నారు. ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ భారతి, మండల వ్యవసాయ అధికారి దీపిక, ఏఈవో రవళిక, ఏపీఎం శంకర్, సర్పంచులు తలారీ మనీషా, గుంటి లక్ష్మి, ఎంపీటీసీ బొరిగం వివేకవర్ధిని, ఏపీఎం శంకర్, ఆర్‌ఐ గంగాధర్, సింగిల్‌విండో చైర్మన్లు అంకతి రాజన్న, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఏలేటి చిన్నారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్‌రెడ్డి, బాస శ్రవణ్, నాయకులు తలారీ ఆనంద్, గుంటి దేవయ్య, నేరెళ్ల దేవేందర్, నేమూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కోరుట్లరూరల్: ధర్మారం, అయిలాపూర్, సర్పరాజ్‌పూర్, కల్లూర్, మాదాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచులు ఇప్ప మంగ, పిడుగు రాధ, దానవేని సాయమ్మ, వనతడుపుల అంజయ్య, ఎంపీటీసీ సుభాష్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సారెడ్డి, ఏపీఎం శంకర్ పాల్గొన్నారు.

'ముక్కోటి'కి ముందురోజే ముహూర్తం..!

- 'అరుణ్ తలకోస్తా' అని సాయి శపథం
- 'సాక్షి' చేతిలో సాయి వార్నింగ్ వీడియో
- సాయి గ్యాంగ్ కాల్పులతో ఉలిక్కిపడిన మానకొండూరు
- గురితప్పిన రెండు రౌండ్లు, పేలని రౌండ్ స్వాధీనం
- పొరుగింట్లోకి దూరి ప్రాణాలు కాపాడుకున్న అరుణ్
- అడ్డొచ్చిన మొత్తం ఏడుగురిని చావబాదిన దుండగులు
- సోదరి మరణానికి ప్రతీకారంగానే హత్యాయత్నం
- రెండు నెలల క్రితమే బిహార్ నుంచి ఆయుధం..?

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/మానకొండూరు: బుధవారం అర్ధరాత్రి కాల్పుల మోతతో మానకొండూరు ఉలిక్కిపడింది. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే పల్లెలో తుపాకులు గర్జన విని జనం భీతిల్లారు. రౌడీషీటర్ అరుణ్‌పై కత్తులు, తుపాకులతో జరిగిన హత్యాయత్నం జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. నేరచరిత్ర కలిగిన అరుణ్ ఆది నుంచి వివాదాస్పదుడే. వరుసగా ఇతనిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో గత సీపీ సత్యనారాయణ ఇతనికి కమిషరేట్ నుంచి బహిష్కరణ విధించారు. ఇటీవల కమిషనరేట్ బహిష్కరణ పూర్తిచేసుకుని వచ్చిన అరుణ్‌పై తుపాకులతో హత్యాయత్నం జరగడం గమనార్హం. వాస్తవానికి ఈ ఘటనకు బీజం ఇప్పుడు పడింది కాదు, పాత కక్షల నేపథ్యంలో ఈ ఏడాది వైకుంఠ ఏకాదశికి ముందురోజు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జీఎం కాలనీలో ప్రధాన నిందితుడు సాయితేజ్ హనుమాన్ ఆలయంలోనే అరుణ్‌ని చంపుతానని ప్రతినబూనాడు.

వస్తూనే దాడి.. కాల్పులు

- పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జీఎం కాలనీలో ఉండే వీణవంక సాయితేజ్ ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి ముందురోజు రాత్రి (నూతన సంవత్సరం రోజు) జీఎం కాలనీలోని హనుమాన్ గుడిలో తన సోదరి మరణానికి కారణమైన 'మానకొండూరు అరుణ్ గాని తలకాయ కోసి.. జీఎం కాలనీ చౌరస్తాలో పెట్టకపోతే నేను సూరి కొడుకునే కాదు' అని శపథం చేశాడు.
- ఈ విషయాన్ని పలువురు స్థానికులు వీడియో కూడా తీశారు. ఇప్పుడు ఈ వీడియో కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ వీడియో 'సాక్షి' చేతికి చిక్కింది. అప్పటి నుంచి సమయం కోసం ఎదురుచూస్తున్న సాయి.. బుధవారం అర్ధరాత్రి తన మిత్రులు భువనగిరి జిల్లా దత్తారుపల్లికి చెందిన పాలమల్లేశ్, మానకొండూరు మండలం కెల్లెడ గ్రామానికి చెందిన బైరగోని మధు, గోదావరిఖనికి చెందిన చంటితో కలిసి రాత్రి 9 గంటల సమయంలో వాహనంలో మానకొండూరుకు వచ్చాడు.
- వెల్ది గ్రామానికి వెళ్లే మార్గం నుంచి వీరు గ్రామంలోకి తుపాకీ, కత్తులతో వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. దాదాపు 9.30 గంటల సమయంలో అరుణ్ తన ఇంటి ముందు సోదరులతో కలిసి మద్యం తాగుతుండగా.. వీరికి తారసపడ్డాడు. వారిని చూడగానే భయంతో అరుణ్ పారిపోయేందుకు ప్రయత్నం చేశాడు.



అరుణ్‌ను చంపుతానంటున్న సాయి (ఫైల్)



దాడిలో గాయపడ్డ అరుణ్

- అతడిని వెంబడించిన నలుగురు బీరు బాటిళ్లతో దాడిచేశారు. అడ్డువచ్చిన అరుణ్ భార్య సుమ, పెద్ద కూతురు వైష్ణవిని తుపాకీ చూపించి తీవ్రంగా కొట్టారు. పారిపోతున్న అరుణ్‌పై రెండు రౌండ్లు కాల్పులు జరపగా గురితప్పాయి. ఓ ఇంట్లోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నాడు. అరుణ్‌పై కోపంతో సదరు ఇంట్లోని ఐదుగురు కుటుంబసభ్యులను విచక్షణారహితంగా, రక్తాలు కారేలా కొట్టారు.
- వీరి అరుపులు విన్న స్థానికులు వచ్చారు. వచ్చిన వారిని తుపాకీ చేతబూనిన వ్యక్తి బెదిరించి పంపాడు. తరువాత చాలామంది రావడంతో సాయితేజ్ పరారు కాగా.. పాలమల్లేశ్, మధును పట్టుకున్న స్థానికులు పోలీసులకు అప్పగించారు.
- పేలని బుల్లెట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వాడింది కంట్రీమేడ్ తుపాకీ (తపంచా) అని తూటా ఆధారంగా నిర్ధరణకు వచ్చారు. మరో నిందితుడు చంటి కూడా పోలీసుల అదుపులోనే ఉన్నాడని సమాచారం.

మాట్లాడకుండానే.. దాడి చేశారు..



మానకొండూర్‌లో ఉన్న మా అత్త గారింటికి నా పిల్లలను చూసేందుకు వచ్చాను. బుధవారం రాత్రి అన్నం తిని బయట ఉండగా గొడవ అవుతోంది. ఈ లోగానే అరుణ్ మా ఇంటి వైపు వచ్చాడని కొందరు మా ఇంటివైపు పరుగు తీసుకుంటూ వచ్చారు. వాడేడి అంటూ ఆగ్రహంతో నాపై స్టీలు ప్యాల క్యాన్‌తో దాడి చేశారు. తల పగిలి రక్తస్రావం జరిగింది. ఇంట్లో వాళ్లపై దాడి చేశారు. ఏం జరుగుతుందో అర్థం కాలేదు. తర్వాత భయాందోళనతో చాలా సేపు తలుపు వేసుకుని ఇంట్లోనే ఉన్నాం, పోలీసులు వచ్చాక బయటకు వచ్చా. – బీరం శ్రీనివాస్, గాయపడ్డ వ్యక్తి

తనకు సంబంధం లేదంటున్న అరుణ్

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అరుణ్‌ను మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. నిందితులు గోదావరిఖనికి చెందిన సాయితేజ్, చంటి, మరో ఇద్దరు మిత్రులు అని వెల్లడించాడు. ఎందుకు దాడి చేశారు..? అని అడిగిన ప్రశ్నకు.. తాను ఒక ప్రభుత్వ ఉద్యోగిని అని, తనకువారితో ఎలాంటి సంబంధమూ లేదని, వారు గంజాయి విక్రయిస్తారని తెలిపాడు. సంబంధం లేని వ్యక్తి చేసే పని, చిరునామా, పేరుతో సహా ఎలా తెలపగలిగాడు..? అన్న విషయంపై పోలీసులు దృష్టి సారించారు. అతనికి సాయితేజకు ఉన్న వైరం ఏంటీ..? అతని సోదరి మరణంలో అరుణ్ ప్రమేయం ఎంతవరకు ఉంది..? అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. నిందితులకు, బాధితుడికి నేరచరిత ఉన్న విషయం వాస్తవమేనని, అన్ని కోణాల్లోనూ కేసు దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు 'సాక్షి'కి తెలిపారు. నిందితుల కోసం మొత్తం మూడు బృందాలు సాయి కోసం గాలిస్తున్నాయి. ఇందులో రెండు హైదరాబాద్‌కు వెళ్లగా.. ఒక టీం గోదావరిఖనికి వెళ్లినట్లు సమాచారం.

బిహార్ నుంచి ఆయుధం..?

ఈ కేసులో ప్రధాన నిందితుడు సాయికి ఆయుధం ఎక్కడిది..? అన్న విషయంపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తుపాకీ కాల్చడంలో నిందితులకు అనుభవం లేదని తాజా ఘటనతో తేలిపోయింది. బుల్లెట్లు వేగంగా లోడు చేయలేకపోవడం.. గురిచూసి కాల్చలేకపోయిన విధానాన్ని బట్టి నిందితులు ఇటీవలే తుపాకీ కొనుగోలు చేసి ఉంటారని పోలీసులు అంచనాకు వచ్చారు. రెండు నెలల క్రితం ఓ కేసు విషయంలో సాయి సెల్‌లోకేషన్ బిహార్‌లో చూపించిందని గోదావరిఖని పోలీసులు తెలిపారు. అదే సమయంలో అతను కాశీయాత్రకు వెళ్లి వచ్చాడని గుర్తుచేసుకుంటున్నారు. దీంతో సాయికి బిహార్‌లో మిత్రులు ఉండి ఉంటారని, వారి ద్వారానే ఆయుధం కొని ఉంటాడని అనుమానిస్తున్నారు.

క్లుప్తంగా

కొప్పుల ఈశ్వర్‌కు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు



ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మపురి : నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఈశ్వర్‌కు సీఎం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పిడుగుపాటుతో ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లో గురువారం వేకువజామున పిడుగు పాటుతో పలువురి ఇళ్లలో టీవీలు, ఫ్యాన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమైనట్లు ఆయా గ్రామస్తులు తెలిపారు. భూషణరావుపేటలో పిడుగుపడటంతో రెండు తాటిచెట్లు కాలిపోయాయని గీత కార్మికులు తెలిపారు.

ఎస్పీకి ఫిర్యాదు

జగిత్యాల క్రైం: జిల్లాలోని రాయికల్ ఎస్సైపై ఎస్పీ ఎగ్గడి భాస్కర్‌కు ఓ వ్యక్తి గురువారం ఫిర్యాదు చేశాడు. మండలంలోని ఒడ్డెలింగాపూర్‌కు చెందిన సుతారి రంజిత్‌కుమార్ తన భార్యతో గొడవ కారణంగా పెద్దమనుషుల సమక్షంలో ఒప్పందం జరిగిందని, గతంలో డీఎస్పీ సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారని తెలిపారు. 2021లో మూసివేసిన కేసును ఎస్సై 2022లో ఎనిమిది మందిపై అక్రమంగా కేసు నమోదు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై డీఎస్పీతో విచారణ చేపడతామని ఎస్పీ హామీ ఇచ్చినట్లు బాధితుడు తెలిపాడు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కోరుట్ల రూరల్ : మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన గద్దె మనోజ్ (25) మహారాష్ట్రలోని పుణేలో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. మనోజ్ పుణేలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం స్నేహితులు గదిలో లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మనోజ్‌కు తల్లి రమ, చెల్లె ప్రతిభ ఉన్నారు. మృతికిగల కారణాలు తెలియరాలేదు.

'సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి'



మాట్లాడుతున్న సాయికుమార్

జగిత్యాల: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో నెలరోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఏబీవీపీ వర్కింగ్ కమిటీ సభ్యుడు సాయికుమార్ అన్నారు. ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. ప్రభుత్వం స్పందించి సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ చేపట్టాలన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ సెక్రటరీలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ నవీన్, సునీల్, శ్రీనివాస్, మనోహర్, మనోజ్ ఉన్నారు.

గొర్రెల పంపిణీకి సన్నాహాలు

- రెండోవిడతలో 3,617 మందికి లబ్ధి
- ఇప్పటికే డీడీలు చెల్లించిన వారికే అందజేత
- అక్రమాలు అరికట్టాలంటున్న గొల్ల, కురుమలు

లబ్ధిదారుల సమాచారం

తొలివిడతలో గుర్తించిన అర్హులు	21067
తొలివిడత గొర్రెలు పొందినవారు	17,450
రెండోవిడతలో గుర్తించిన వారు	3,617
యూనిట్ విలువ(రూ.లక్షల్లో)	1.75
ఒక్కో లబ్ధిదారు వాటా(రూ.లలో)	43.750



పెగడపల్లిలో తొలివిడత గొర్రెలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు (ఫైల్)

పెగడపల్లి(ధర్మపురి): జిల్లాలో రెండోవిడత గొర్రెల పంపిణీకి ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు నిర్దేశిత లక్ష్య సాధనకు ప్రత్యేక ప్రణాళికతో ముందు కు సాగుతున్నారు. తొలివిడతలో గుర్తించిన వారందరికీ గొర్రెలు పంపిణీ చేయక ముందే ముందే పథకం నిలిచిపోయింది. అప్పుడు మిగిలిన వారి తోపాటు తాజాగా గుర్తించిన వారందరికీ గొర్రెలు పంపిణీ చేసేందుకు సన్నాహాలు ప్రారంభించారు.

జిల్లాలో 21,067 యూనిట్లు

- జిల్లాలోని 20 మండలాల్లో 21,067 యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, తొలివిడతలో 17,450 యూనిట్లు పంపిణీచేశారు.
- రెండోవిడతలో 3,617 మందికి పంపిణీ చేయాల్సి ఉంది.
- నామినీలు తమ సొసైటీ తీర్మానాలను పశువైద్యాధికారులకు అందించి పేరు మార్పిడి చేసుకుని గొర్రెల యూనిట్ పొందే అవకాశం ఉంది.
- రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని 2017లో ప్రారంభించింది.
- తొలివిడతలో డీడీలు చెల్లించి, గొర్రెలు రానివారితోపాటు రెండోవిడతలో గుర్తించిన అర్హులందరికీ యూనిట్లు అందజేస్తామని ప్రభుత్వం తాజాగా వెల్లడించింది.
- ప్రస్తుతం యూనిట్ ధర పెరగడంతో లబ్ధిదారులు తమ వాటాధనాన్ని డీడీల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.

అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ..

- తొలివిడతలో గొర్రెల పంపిణీ పక్కదారి పట్టిందని, రీ సైక్లింగ్ జరిగిందని ఆరోపణలు వచ్చాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో క్షేత్రస్థాయిలో 30 శాతం గొర్రెలు కనిపించడం లేదంటున్నారు. వీటిపై ప్రభుత్వానికి ఫిర్యాదులూ వెళ్లాయి. దీంతో రెండోవిడతను పక్కగా చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పెరిగిన యూనిట్ ధర..

- గతంలో గొర్రెల(20 గొర్రెలు, ఒక పొట్టేలు) యూనిట్ ధర రూ.1.25 లక్షలు ఉండగా ఇప్పు డు అదే యూనిట్ ధర రూ.1.75 లక్షలకు పెరిగింది.
- అప్పుడు లబ్ధిదారు తనవాటా రూ.31.250 చెల్లించగా, ఇప్పుడు రూ.43.750 చెల్లించాల్సి ఉంది.
- తొలివిడతలో డీడీలు చెల్లించి యూనిట్లు పొందని వారు పెరిగిన వాటాధనం డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంది.



ఎదురు చూస్తున్నం

గొర్రెల కోసం డీడీ చెల్లించి ఏళ్లు గడినయి. ఇంకా గొర్రెలు ఇవ్వలేదు. ఇదేమిటని అడిగితే రెండోవిడతలో ఇస్తమంటున్నరు. వాటికోసం ఎదుచూస్తున్నం.

– బండారి కమలాకర్, లబ్ధిదారు, పెగడపల్లి



చర్యలు తీసుకుంటున్నాం

రెండోవిడత గొర్రెల పంపిణీకి సన్నాహాలు చేస్తున్నాం. డీడీలు తీయని వారు తక్షణమే డీడీలు తీయాలని చెబుతున్నాం. లక్ష్యం మేరకు పంపిణీ చేస్తాం.

– గోపాలకృష్ణమూర్తి,జిల్లా పశువైద్యాధికారి

ఘనంగా మంత్రి కొప్పుల జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న నాయకులు

పెగడపల్లి: మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలను గురువారం బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్, గ్రామశాఖల ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతర ఆలయ ఆవరణలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో మంత్రి ఈశ్వర్ చేస్తున్న ప్రజాసేవా కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలుతీరును కొనియాడారు. సింగిల్‌విండో చైర్మన్ మంత్రి వేణుగోపాల్, రైతుబంధు చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ గంగాధర్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆంజనేయులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకన్న, పలుగ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నారాయణస్వామి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణస్వామి

జగిత్యాల రూరల్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అలగుర్తి లక్ష్మీనారాయణ స్వామి అన్నారు. గురువారం తిప్పన్నపేట గ్రామ శివారులోని బీఎల్‌ఎన్ గార్డెన్స్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. గరీబ్ కల్యాణ్ అన్నా యోజన పథకం ద్వారా మోడీ సర్కార్ రూ.20 లక్షల కోట్లతో కరోనా విపత్కర సమయంలో పేదలకు ఉచితంగా నిత్యావసర వస్తువులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిలుక మర్రి మదన్‌మోహన్, బత్తుల శ్రీనివాస్, నరేశ్, బాబు, రమేశ్, భూమన్న, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాల రూరల్: ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి అన్నారు. గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్ లతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రధానపంట అయిన మొక్కజొన్న పంటను రైతులు బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.2200 ఉండగా వ్యాపారులు సిండికేట్‌గా మారి ప్రస్తుతం రూ.1500 నుంచి రూ.1700లకే కొనుగోలు చేస్తున్నారన్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.1960 చెల్లించి పంటను కొనుగోలు చేయాలన్నారు. . కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్ రెడ్డి, నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, అనిల్‌కుమార్, కరుణాకర్ రెడ్డి, నర్సింహా రెడ్డి, రాము, రాజన్న, జలేందర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన విద్యార్థి



డ్రైవర్‌ను అదుపులో తీసుకుంటున్న పోలీసులు

మల్లాపూర్ : మండలకేంద్రం శివారులోని మోడల్ స్కూల్ బస్‌స్టాప్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోడల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న సిరిపూర్‌కు చెందిన శ్రీధర్, జశ్వంత్ గురువారం పరీక్ష రాసి బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. బస్‌స్టాప్ వద్దకు చేరుకోగానే వీరి బైక్‌ను శ్రీధర్ అనే వ్యక్తి కారుతో ఎదురుగా అతివేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో విద్యార్థి శ్రీధర్‌కు తీవ్రగాయాలుకాగా జశ్వంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. పాఠశాల ప్రిన్సిపాల్ అలీమొద్దీ న్, అధ్యాపకులు 108కు సమాచారం అందించగా విద్యార్థిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘ ట నా స్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. కారును సీజ్‌చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రి న్సిపాల్ అలీమొద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలి పారు.

ఓటరు జాబితాపై ఆర్డీవో సమీక్ష



సమీక్షిస్తున్న ఆర్డీవో వినోద్‌కుమార్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో వినోద్‌కుమార్ గురువారం సమీక్షించారు. తొలగింపు జాబితాను పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ మహేశ్వర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటర్ వెరిఫికేషన్ పకడ్బందీగా నిర్వహించాలి

మల్లాపూర్: ఓటర్ వెరిఫికేషన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో వినోద్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని సాతారం, సంగెం–శ్రీరాంపూర్ గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను ఆయన సందర్శించారు. ఓటర్‌లిస్టులను పరిశీలించి ఓట్ల తొలగింపుపై నిజనిర్ధారణ చేసి బీఎల్వోలకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఓటర్‌లిస్ట్ నుంచి ఓట్ల తొలగింపు చేపట్టాలన్నారు. ప్రజలకు ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ రవీందర్, ఆర్‌ఐలు విశ్వనాథ్, రాజేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భారతి, శంకరమ్మ, సర్పంచ్ పాలెపు దిలీప్, ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్, కార్యదర్శులు, బీఎల్వోలు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి రైతు పరేషాన్..!

- ఒక్కసారిగా పతనమైన ధరలు
- దళారీ దెబ్బకు దయనీయంగా రైతుల పరిస్థితి
- ధర పెరుగుతుందనే ఆశతో ఇళ్లలోనే నిల్వలు



ఇంట్లో నిల్వచేసిన పత్తి

వెల్గటూర్: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను దళారీలు దగా చేస్తున్నారు. గతేడాది ఇదే సీజన్‌లో రూ.12 వేలు పలికిన పత్తి ధర ప్రస్తుతం రూ.7,500లోపే పలుకుతోంది. దళారీలు సిండికేట్‌గా మారి రెతులను నిండా ముంచుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులంతా కలిసి రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

దయనీయంగా పరిస్థితి..

గతేడాది ఇదే సమయంలో క్వింటాల్ పత్తికి రూ.12వేలు పలకడంతో ఈ సంవత్సరం ఎక్కువ శాతం రైతులు పత్తి సాగు చేశారు. అయితే ఈ ఏడాది పత్తి అనుకున్న స్థాయిలో రైతుకు కలిసి రాకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. భారీవర్షాలతో ఆశించిన మేర పత్తి దిగుబడి రాలేదు. పెట్టుబడి ఖర్చులు రెట్టింపవడం, మరోవైపు పత్తి దిగుబడి తగ్గిపోవడంతో అన్నదాతలు ఆందోళనలో చెందుతున్నారు.

మూడు నెలలుగా ఇళ్లల్లోనే..

జగిత్యాల జిల్లాలో ఈ ఏడాది అధికారుల అంచనా ప్రకారం 20, 263 ఎకరాల విస్తీర్ణంలో పత్తిని సాగు చేశారు. అత్యధికంగా వెల్గటూర్ మండలంలో 5 వేల ఎకరాలు, ధర్మపురి 3వేలు, గొల్లపల్లి, కొడిమ్యాలలో 2,700, బుగ్గారం, రాయికల్, బీర్పూర్‌లలో వెయ్యి ఎకరాలపైన పత్తిపంట సాగు చేసినట్లు అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది క్వింటాల్ పత్తికి మద్దతు ధర రూ.6,380 ఉండగా సీజన్ ప్రారంభంలో బహిరంగ మార్కెట్‌లో 9,500 వరకు పలికింది. దీంతో రైతులంతా సీసీఐకి బదులు బహిరంగ మార్కెట్లలో విక్రయించారు. ఇప్పటివరకు 60 శాతం మాత్రమే పత్తిని విక్రయించగా మరో 40 శాతం పత్తి ఇంకా రైతుల వద్దే ఉంది. అయితే రెండు నెలలుగా పత్తికి ధర తగ్గుతూ వచ్చి ప్రస్తుతం రూ.7వేల నుంచి 7,500 వరకు పలుకుతోంది.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ..

జిల్లాలో వెల్గటూర్ మండలంలోని కొత్తపేటలో మాత్రమే సీసీఐ కేంద్రం ఉండగా దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి తీసుకువచ్చేందుకు రవాణా ఖర్చులే అధికమవడంతో రైతులు ఎక్కువశాతం బహిరంగ మార్కెట్లోనే పత్తిని విక్రయిస్తున్నారు. సీసీఐలో ఈ నామ్ పద్ధతిలో పత్తి కొనుగోలు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఒకరిద్దరు వ్యాపారులే పత్తి కొనుగోలు చేయడం, వారంతా సిండికేట్‌గా మారడంతో నాణ్యత ఉన్న పత్తికి కూడా తేమపేరుతో తక్కువ ధర చెల్లించి రైతులను మోసం చేస్తున్నారనే విమర్శలున్నాయి. అధికారులు చొరవ చూపి పత్తిని ఎక్కువధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెట్టుబడి వచ్చేలా లేదు



నేను గత పదేళ్లుగా పత్తి సాగుచేస్తున్నా. గతేడాది మంచి ధర వచ్చిందని ఈ సంవత్సరం నాకున్న రెండెకరాలతో పాటు ఐదెకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశా. అనుకున్న దిగుబడి రాలేదు. పత్తికి ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా వచ్చేలా లేదు.

– కంతెం తిరుపతి, పాశిగామ రైతు

ఇంట్లోనే నిల్వచేశాం



గతేడాది ఇదే సమయంలో క్వింటాల్‌కు పత్తికి రూ.12వేలు పలికింది. ఈ సంవత్సరం వర్షాలతో దిగుబడి తగ్గింది. పండించిన పత్తికి కూడా మంచి ధర లేకపోవడంతో ఇంట్లోనే నిల్వ చేశా. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఎక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేయాలి.

– బరుపటి మల్లేశ్, పాశిగామ గ్రామస్తుడు

లాడ్జిల్లో పోలీసుల తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న పట్టణ సీఐ రాంచందర్‌రావు

జగిత్యాల క్రైం: ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జగిత్యాల, కొండగట్టు, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లితో పాటు పలు ప్రాంతాల్లోని లాడ్జిల్లో గురువారం రాత్రి పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. లాడ్జిల్లో ఉన్న వారి వివరాలను సేకరించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ... ఎలాంటి ఆధారాలు లేకుండా లాడ్జిలకు వచ్చే వారికి గదులు కేటాయించొద్దని, గది బుక్ చేసే ముందు వారి ఆధార్‌కార్డుతో పాటు పూర్తి వివరాలు తీసుకున్న తర్వాతే గదులు కేటాయించాలన్నారు.

నిప్పంటుకొని పశువుల పాక దగ్ధం



దగ్ధమవుతున్న పశువుల పాక

పెగడపల్లి: మండలంలోని నందగిరిలో గురువారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఓ రైతుకు చెందిన పశువుల పాక దగ్ధమైంది. గ్రామానికి చెందిన బొంతల రమేశ్ అనే రైతు గ్రామ సమీపంలో పశువుల పాక నిర్మించి పాడి పశువులను పెంచుతున్నాడు. సాయంత్రం ప్రమాదవశాత్తు పాకకు నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే పశువులను బయటికి తరలించడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనలో సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.


సామగ్రిని ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

జగిత్యాల క్రైం : జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బూస వనజ ఇంట్లో అక్రమంగా ప్రవేశించి సామగ్రి ధ్వంసం చేసిన బూస రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు. గ్రామానికి చెందిన బూస వనజ భర్తతో కలిసి అద్దె ఇంట్లో కిరాయికి ఉంటోంది. ఆమె మరిది బూస రవీందర్ బుధవారం రాత్రి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి ఇంట్లో ఉన్న కూలర్, కుట్టుమిషన్, ఇతర సామగ్రి బయటపడేసి నిప్పుపెట్టగా సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లింది. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తెలిపారు. నిధులు మంజూరుపై గురువారం ఆలయం ముందు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ..గతంలో మంత్రి కేటీఆర్ ఆలయ నిర్మాణానికి రూ.2 కోట్లు ఇస్తానని ప్రకటించారని, ఈ మేరకు నిధులు మంజూరు చేశారన్నారు. తొందర్లోనే మంత్రి కేటీఆర్ చేతులమీదుగా పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున కూడా నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి కేటీఆర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి



రాజయ్య మృతదేహం

బుగ్గారం(ధర్మపురి): జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం మద్దునూర్ గ్రామానికి చెందిన సబ్బు రాజయ్య(67) గురువారం అకస్మాత్తుగా మృతి చెందాడు. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. రాజయ్య కుటుంబం ఉపాధి నిమిత్తం కొన్నేళ్లుగా ముంబాయిలో నివాసం ఉంటోంది. వ్యక్తిగత పనుల కోసం ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. మూడు రోజులుగా అనారోగ్యంగా బాధపడుతున్నాడు. జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి గురువారం వెళ్లాడు. వైద్యపరీక్షలు చేయించుకొని మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులో తిరుగుపయనమయ్యాడు. స్వగ్రామంమద్దునూర్ చేరుకోకముందే బుగ్గారంలో బస్సు దిగాడు. ఓ చోట ఆగి దాహం తీర్చుకున్నా డు. కాసేపటికే కుప్పకూలిపోయాడు. స్థానికులు సమీపంలోని నీడ ప్రదేశానికి చేర్చి విశ్రాంతి కల్పించారు. అతడి జేబులో లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా బంధువులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా అప్పటికే రాజయ్య మృతి చెందాడు. స్థానిక ఆర్‌ఎంపీలు పరీక్షించి వడదెబ్బతో మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. వారు ముంబయి నుంచి వచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

మొక్కలు ధ్వంసం చేసిన వ్యక్తికి నోటీసులు



ధ్వంసమైన మొక్కలు, చెట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో రమాదేవి

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని తుర్కపల్లిలో హరితహారంలో నాటిన మొక్కలను ధ్వంసం చేసిన కొండి సురేందర్‌కు గురువారం నోటీసులు జారీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సిద్దుల శ్రీనివాస్ తెలిపారు. తుర్కపల్లి, సిరిసిల్ల రహదారికి ఇరువైపులా ఐదేళ్ల క్రితం నాటిన మొక్కలను పూర్తిగా తొలగించారని చెప్పారు. పది పెద్ద చెట్లు, 25 చిన్న మొక్కలు ధ్వంమైనట్లు గుర్తించామని ఎంపీడీవో రమాదేవి తెలిపారు. ఈమేరకు రూ.75వేల జరిమానా చెల్లించాలని సురేందర్‌కు నోటీసులు అందజేశామన్నారు. జేసీబీతో మొక్కలు, చెట్లు తొలగించడమే కాకుండా ఆర్అండ్‌బీ రహదారికి చెందిన సిమెంట్ ఖనీలను తొలగించారన్నారు. ఆ శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు

మేడిపెల్లి : భీమారం మండలంలోని వెంకట్రావుపేట్, ఓడ్యాడ్, రాగోజీపేట గ్రామాల్లో గురువారం జోడోయాత్రకు మద్దతుగా పార్టీ వేములవాడ నియోజక వర్గ ఇన్‌చార్జి ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ నేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల డిక్లరేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, లచ్చనాయక్, రంగు వెంకటేశ్, గఫూర్, సయ్యద్, జీవన్, వరుణ్, అజయ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలో గురువారం ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పట్టణ ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రాలీ ఆటోలో ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. బుడిగజంగాల కాలనీకి చెందిన రాజేశం నర్సింగా పూర్ నుంచి బియ్యాన్ని అక్రమంగా జగిత్యాలకు తరలిస్తుండగా పట్టుకొని ట్రాలీ ఆటోను సీజ్ చేసినట్లు తెలి పారు. రాజేశంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.